# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో జాప్యం ఉండకూడదు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

- ఇందిరమ్మ గృహ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్
- తూడుకుర్తిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 18 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని తూడుకుర్తి గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామంలో కొనసాగుతున్న గృహ నిర్మాణాల పురోగతి, నాణ్యత ప్రమాణాలు మరియు లబ్ధిదారులకు ఎదురవుతున్న సమస్యలపై అధికారులు, లబ్ధిదారులతో జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం క్రింద లబ్ధిదారురాలు గుబ్బల హేమలతకు మంజూరైన ఇంటి నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించి నిర్మాణ పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి త్వరలోనే గృహప్రవేశానికి సిద్ధం చేయాలని ఆమెకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకొని ఇంటి నిర్మాణాన్ని నాణ్యతతో పూర్తి చేసుకోవాలని తెలిపారు. గ్రామంలో మంజూరైన ఎల్-3 కేటగిరీకి చెందిన మూడు ఇండ్ల నిర్మాణ పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలపై ఇంజినీరింగ్ అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. నిర్మాణ పనుల నాణ్యత, పనుల వేగం, అవసరమైన సాంకేతిక సదుపాయాలు, పరిపాలన అంశాలను కలెక్టర్ సమగ్రంగా సమీక్షి ంచారు. ఎక్కడైనా పనులు నిలిచిపోయిన పరిస్థితులు ఉంటే వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఎటువంటి జాప్యం లేకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. లబ్ధిదారులకు అవసరమైన నిర్మాణ సామగ్రి, సాంకేతిక సహాయం, నిధుల విడుదల వంటి అంశాలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ సామగ్రి కొరత, నిధుల విడుదలలో ఆలస్యం వంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని అధికారులకు తెలిపారు. నిధుల విడుదల ప్రక్రియను వేగవంతం చేసి లబ్ధిదారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇండ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా బలమైన నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. లబ్ధిదారులతో ప్రత్యక్షంగా మాట్లాడిన కలెక్టర్, ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. సొంత ఇంటి కలను సాకారం చేసుకునేందుకు ప్రభుత్వంఅందిస్తున్న అవకాశాన్ని వినియోగించుకొని నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట మండల అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

మహబూబ్‌నగర్

వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట

# ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

- మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా
- ప్రజావాణిలో 122 దరఖాస్తుల స్వీకరణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 18 ప్రభాతవార్త :** ప్రజావాణిలో అర్జిదారుల నుండి వచ్చిన దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పాల్గొన్నారు. ప్రజావాణిలో గృహ నిర్మాణం, విద్యుత్, గిరిజన సంక్షేమం, పంచాయతీరాజ్, మున్సిపల్, జిల్లా సంక్షేమ శాఖ, భూ సర్వే రికార్డులు, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, మిషన్ భగీరథ, జిల్లా మైనారిటీ సంక్షేమం, రోడ్డురవాణా, బ్యాంకింగ్, పోలీస్, మైనింగ్, గ్రామీణ అభివృద్ధి, అటవీశాఖ, విద్య, వైద్యం, నీటి పారుదల తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 122 వినతులను అధికారులు నమోదు చేసుకున్నారు.

**సెన్సస్ పై తహశీల్దార్లు, ఎంపిడిఓలతో సమీక్ష...**

ప్రజావాణి అనంతరం జిల్లాలో జనగణన నిర్వహణకు సంబంధించి మండల తహసీల్దార్లు, ఎంపిడిఓలతో వెబెక్స్ ద్వారా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చాలా మండలాల్లో ఇంకా హౌస్‌లిస్టింగ్ బ్లాక్స్ (హెచ్‌ఎల్‌బిలు) ఎందుకు ప్రారంభించలేదని ఆమె ప్రశ్నించారు. ముఖ్యంగా హన్వాడ, కోయిలకొండ, జడ్చర్ల మండలాల్లో హెచ్‌ఎల్ బిలు ఇంకా ప్రారంభం కాలేదని, చాలా వెనుకబడి ఉన్నాయని తెలిపారు. దీనికి సంబంధించిన కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జనగణనకు సంబంధించిన హెచ్‌ఎల్ బిలను వెంటనే ప్రారంభించాలని ఆమె ఆదేశించారు. అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి 100 శాతం హెచ్‌ఎల్‌బి లను వెంటనే ప్రారంభించి, వాటిని త్వరితగతిన పూర్తి చేసి జనగణన ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. -మిగతా4లో..

# ఉపాధి హామీ పనులు నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలి

- గ్రామాభివృద్ధికి ఉపాధి హామీ పథకం కీలకం
- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 18 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని శ్రీపురం గ్రామంలో కొనసాగుతున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పరిశీలించారు. గ్రామ పరిధిలో చేపడుతున్న చెరువు పూడిక తీత పనులను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసిన కలెక్టర్ పనుల పురోగతి, నాణ్యతపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో మాట్లాడిన కలెక్టర్ వారికి అందుతున్న వేతనాలు, పని పరిస్థితులు, తాగునీరు తదితర సౌకర్యాలపై వివరాలు సేకరించారు. గ్రామం నుంచి సుమారు 100 మంది ఉపాధి హామీ కూలీలు ఉదయం వేళలోనే పనులకు హాజరై పనులు ప్రారంభించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి పనులతో పాటు గ్రామీణ ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కీలక పాత్ర పోషిస్తోందని, గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు పేద కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రతిరోజూ అధిక సంఖ్యలో కూలీలు ఉపాధి హామీ పనులకు హాజరై ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్యను తగ్గించడంలో ఉపాధి హామీ పనులు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని, కూలీలు పనులకు క్రమం తప్పకుండా హాజరవుతూ ఆదాయాన్ని పెంచుకోవాలని కోరారు. చెరువుల పూడిక తీత పనులు గ్రామాల అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని, ఈ పనుల ద్వారా చెరువుల నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు భూగర్భ జలాలు మెరుగుపడి రైతులకు సాగునీటి సమస్యలు తగ్గుతాయని తెలిపారు. పూడిక తీత వల్ల వ్యవసాయ భూముల సారవంతం కూడా పెరుగుతుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఇది బలాన్నిస్తుందని చెప్పారు. ఉపాధి హామీ పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పనుల అమలులో పారదర్శకత ఉండాలని, ప్రజలకు నిజమైన ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని మండల స్థాయి అధికారులకు సూచించారు. పనుల నిర్వహణలోఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా కొనసాగుతున్నాయని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలాలు ప్రతి అర్హత కుటుంబానికి చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎంపీడీఓ చెన్నమ్మ గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, ఉపాధిహామీ శాఖఅధికారులు పాల్గొన్నారు.

# మిల్లర్లు దొడ్డు రకం ధాన్యాన్ని కూడా దించుకోవాల్సిందే

- వరి ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి
- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ , పాల్గొన్న జిల్లా అధికారులు

**వనపర్తి, మే18, ప్రభాతవార్త:** సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్‌తో కలిసి జిల్లాలో కొనసాగుతున్న వరి కొనుగోలు ప్రక్రియ పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులు, గోదాములకు వరి తరలింపు అన్‌లోడింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యంలేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మిల్లర్లు సన్నరకం, వరి ధాన్యంతో పాటు దొడ్డు రకం ధాన్యాన్ని కూడా దించుకోవాల్సిందేనని, ఆ దిశగా అన్లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా, ధాన్యాన్ని దించుకోవడానికి ఖాళీ గోడౌన్లను కూడా అందుబాటులోకి తీసుకోవాలని సూచించారు. అవసరమైన మేరకు అదనపువాహనాలను సమకూర్చేందుకు రవాణా శాఖ అధికారులు ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వరి రవాణా ప్రక్రియ నిరంతరంగా కొనసాగేందుకు ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. రైతులు ఇబ్బందులు పడకుండా వరి సకాలంలో అన్‌లోడింగ్ అయ్యేలా చూడాలని అధికారులకు తెలిపారు. సమావేశంలో పౌర సరఫరాల డిఎం ఆంజనేయులు, డిసిఓ రాణి, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

# విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి : జిల్లా కలెక్టర్



మాక్‌డ్రిల్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ప్రతినిధి, మే 18 ,ప్రభాతవార్త:** భవిష్యత్తులో సంభవించే ఎలాంటి విపత్తులనైన సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డిఎంఎ) ఆదేశాలు, రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్‌డిఆర్‌ఎఫ్) సూచనల మేరకు వనపర్తి పట్టణంలోని నల్లచెరువులో సోమవారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. భారీ వరదలు సంభవించిన సందర్భంలో ప్రజలను ఎలా రక్షించాలి, అత్యవసర పరిస్థితుల్లో స్పందనా బృందాలు ఎలా పనిచేయాలనే అంశాలపై ఈ మాక్‌డ్రిల్ చేపట్టారు. మాక్ డ్రిల్‌లో భాగంగా వరదల కారణంగా నల్ల చెరువులో ముంపునకు గురై చిక్కుకున్న ప్రజలను ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, అగ్నిమాపక, పోలీస్‌శాఖలు సురక్షితంగా రక్షించే చర్యలను ప్రదర్శించారు. స్పందనా బృందాలు సమన్వయంతో పనిచేస్తూ బోటు, లైఫ్ జాకెట్ల సాయంతో ప్రజలను రక్షించి, ప్రథమ చికిత్స అందజేసి అంబులెన్సులో సురక్షత ప్రాంతాలకు తరలించే విధానాన్ని ప్రత్యక్షంగా -మిగతా4లో..

# ఎలాంటి విపత్తులనైన ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధం

- నారాయణపేట జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక



**కృష్ణ, మే 18 ప్రభాతవార్త:** వరద ముప్పు ముంచెత్తితే.. క్షణాల్లో రక్షించే చర్యలపై కృష్ణా మండలం గుడేబల్లూర్ లోని వాసునగర్ కాలనీ లో జిల్లా యంత్రాంగం లైవ్ డెమో నిర్వహించారు. భవిష్యత్తులో సంభవించే ఎలాంటి విపత్తుల నైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సంసిద్ధతతో ఉందని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక తెలిపారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్ డి ఎం ఏ) ఆదేశాలు, రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్ డి ఆర్ ఎఫ్) సూచనల మేరకు నారాయణపేట జిల్లా కృష్ణా మండలం నదీ పరివాహక ప్రాంతమైన వాసునగర్ లో సోమవారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. భారీ వరదలు సంభవించిన సందర్భంలో ప్రజలను ఎలా రక్షించాలి, అత్యవసర పరిస్థితుల్లో స్పందనా బృందాలు ఎలా పనిచేయాలనే అంశాలపై ఈ మాక్‌డ్రిల్ చేపట్టారు. మాక్‌డ్రిల్‌లో భాగంగా వరదల కారణంగా వాసు నగర్ లో ముంపునకు గురై చిక్కుకున్న ప్రజలను ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, అగ్నిమాపక, పోలీస్ శాఖలు సురక్షితంగా రక్షించే చర్యలను ప్రదర్శించారు. స్పందనా బృందాలు సమన్వయంతో పనిచేస్తూ బోటు, లైఫ్ జాకెట్ల సాయంతో ప్రజలను రక్షించి, ప్రథమ చికిత్స అందజేసి అంబులెన్సులో సురక్షిత ప్రాంతాలకు తరలించే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. ఈ మాక్‌డ్రిల్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక పరిశీలించి, సహాయక చర్యల నిర్వహణ తీరును దగ్గరుండి పర్యవేక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విపత్తులు వచ్చి అత్యవసర పరిస్థితులు ఏర్పడిన సమయంలో ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా ప్రజల్ని ఎలా కాపాడాలని అంశంపై మార్క్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ శాఖలు సంసిద్ధత కోసం ఈ మాక్ డ్రిల్ అనేది ఎంతో ముఖ్యమైన ప్రక్రియ అని తెలిపారు. వరదలు వచ్చి అత్యవసర పరిస్థితులు ఏర్పడే ఏడు ప్రదేశాలను జిల్లాలో గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. 10 సెంటీమీటర్స్ పైన వర్షపాతం నమోదు అయితే కృష్ణానది కి 6 నుంచి 7 లక్షల క్యూసెక్కుల నీరు వస్తే వాసు నగర్ లో వరద నీటితో అత్యవసర పరిస్థితి ఏర్పడే నేపథ్యంలో ఇక్కడ మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని ఆమె తెలిపారు. అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, నీటిపారుదల శాఖ, ఇతర ముఖ్యమైన శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజల ప్రాణాలను కాపాడే చర్యలను సంసిద్ధతను ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ రాజేందర్ గౌడ్, డీఎఫ్ఓ సురేష్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ వెంకట రమణ, ఆర్డీవో మేఘా గాంధీ, పీఆర్‌ఈఈ అశోక్, జిల్లా మత్స్య అధికారి రెహమాన్, పశుసంవర్ధక శాఖ అధికారి ఈశ్వర్ రెడ్డి, డీపీఆర్‌వో రషీద్, కృష్ణా తహసిల్దార్ శ్రీనివాస్, వాసు నగర్ సర్పంచ్ స్వాతమ్మ, ఇతర జిల్లా శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు ఒకచోట.. అక్రమ తవ్వకాలు మరోచోట

- ఎడివెల్లి ఊర చెరువులో యథేచ్ఛగా ఒండ్రుమట్టి దోపిడీ



అక్రమ తవ్వకాలు జరుపుతున్న దృశ్యం



టిప్పర్ల ద్వారా ఒండ్రుమట్టిని తరలిస్తున్న దృశ్యం

**నారాయణపేట, మే 18 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా ఉట్కూర్ మండలం ఎడివెల్లి గ్రామ పరిధిలోని ఊర చెరువులో ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ, అనుమతించిన సర్వే నెంబర్లను పక్కనపెట్టి వేరే ప్రాంతాల నుంచియథేచ్ఛగా ఒండ్రుమట్టిని (సిల్ట్)తరలిస్తున్నారని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు వాకిటి అంజనేయులు ముదిరాజ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన అధికారులను నిలదీస్తూ ప్రకటన విడుదల చేశారు. తహసిల్దార్ కార్యాలయం జారీ చేసిన ఉత్తర్వులు ( నెంబర్. సీ /81/2026) ప్రకారం ఎడివెల్లి ఊర చెరువులోని సర్వే నెంబర్లు 28, 29, 30, 53 ప్రాంతాల నుంచే మట్టిని తీయాల్సి ఉండగా, అక్రమార్కులు ఇతర సర్వే నెంబర్లలోని విలువైనఒండ్రుమట్టిని తవ్వితరలిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం7గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకుమాత్రమే రవాణాకు అనుమతి ఉన్నప్పటికీ, సాయంత్రం 6 గంటలు దాటిన తర్వాత కూడా టిప్పర్ల ద్వారా మట్టిని తరలించడం కొనసాగుతోందని పేర్కొన్నారు. నిబంధనలను బహిరంగంగా ఉల్లంఘిస్తున్నా చర్యలు కనిపించడం లేదని విమర్శించారు. ఈ అక్రమ రవాణాను పర్యవేక్షించాల్సినస్థానిక జీపీఓ, ఆర్ఐలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వారి పర్యవేక్షణ లోపం వల్లే ఈ దోపిడీ సాగుతోందని అంజనేయులు మండిపడ్డారు. ఈ సందర్భంగా వాకిటి అంజనేయులు ముదిరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వానికి కట్టిన చలానా ఒకదానికి అయితే, క్షేత్రస్థాయిలో జరుగుతున్న తవ్వకాలుమరో విధంగా ఉన్నాయని, ఇది ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే చర్య అని అన్నారు. అక్రమంగా తరలించిన ఒండ్రుమట్టిపై సమగ్ర న్యాయ విచారణ జరిపి -మిగతా4లో..

# వ్యవసాయ మార్కెట్ గేటుకు తాళం వేసిన రైతులు

## అధికారుల నిర్లక్ష్యంపై రైతులు తీవ్ర ఆగ్రహం



మార్కెట్ గేట్‌కు తాళం వేసిన దృశ్యం



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సైదులు

**అచ్చంపేట, మే18, ప్రభాతవార్త:** అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద సోమవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మొక్కజొన్న కొనుగోళ్లలో అధికారుల అలసత్వాన్ని, నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆగ్రహం చెందిన రైతులు మార్కెట్ ప్రధాన గేటుకు తాళం వేసి నిరసనకు దిగారు. ఇటీవలే స్థానిక ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ప్రత్యేక సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆర్డీవో, తహసీల్దార్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని రైతులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, రవాణా ఇబ్బందులు ఎదురవుతుండటంతో సమస్యలను చెప్పుకుందామని తాము ఫోన్ చేస్తే.. కనీసం తహసీల్దార్, ఆర్డీవోలు ఫోన్లు కూడా ఎత్తడం లేదని రైతులు మండిపడ్డారు. మండుటెండల్లో ధాన్యంనిల్వలతో 20 రోజులు తరబడి మార్కెట్ యార్డులోనే పడిగాపులు కాయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు ఆదేశించినా అధికారులలో చలనం రాకపోవడం ఏంటని వారు ప్రశ్నించారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి కొనుగోళ్లు సజావుగా సాగేలా చూడాలని, అంతవరకు తాళాలు తీసేది లేదని రైతులు భీష్మించుకు కూర్చున్నారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ సైదులు అక్కడికి చేరుకుని రైతులతో మాటాడారు. రైతులకు తగిన న్యాయం చేస్తానని చెప్పడంతో రైతులు మార్కెట్ గేట్ తాళం తీసి నిరసన విరమించారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ జానకి

# ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు
- మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి

**మహబూబ్‌నగర్ క్రైమ్, మే18, ప్రభాతవార్త:** జిల్లా పోలీసు కార్యాలయానికి వివిధ సమస్యల నిమిత్తం వచ్చిన ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని పోలీస్ అధికారులను సిబ్బందిని ఎస్పీ జానకి ధరావత్ ఆదేశించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన 26 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ డి.జానకి క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజల సమస్యలను ఓర్పుతో విని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు పోలీసు శాఖపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రతి పోలీసు అధికా బాధ్యత అని తెలిపారు. ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును పారదర్శకంగా పరిశీలించి, చట్టపరమైన చర్యల ద్వారా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. బాధితులకు వేగవంతమైన సేవలు అందించేందుకు అధికారులు స్పందనాత్మకంగా పనిచేయాలని సూచించారు.

# ఆక్రమణలు తొలగుతున్నాయ్!

- జడ్చర్లలో కమిషనర్ గిరీష్ రెండో రోజు పర్యటన
- ఎంపీడీవో కార్యాలయం ఆనుకొని ఉన్న ఎంక్రోచ్‌మెంట్ తొలగింపు



అక్రమణాలను తొలగింపజేస్తున్న కమిషనర్ గిరీష్

## రైతులు పంటల సాగులో యూరియా వినియోగాన్ని తగ్గించాలి



**కెటిదొడ్డి మే 18, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పాతపాలెం గ్రామం రైతువేదికలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యం లో రైతు ముంగింట్లో శాస్త్రవేతలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రైతులకు 6 ప్రాధాన్యత అంశాలపై అవగాహన కల్పించారు. వీటిలో ముఖ్యం గా రైతులు పంటల సాగులో యూరియా వినియోగాన్ని తగ్గించాలి. దానికి ప్రత్యామ్నాయం గా నానో యూరియా వాడాలని, పంటల వైవిధ్యేకరణ, రసాయన మందుల వినియోగం తగ్గించడం, మేలైన నీటి వినియోగ పద్ధతులపై పాలెం లో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్ర వేత్తలు డాక్టర్ కె.సదయ్యా, జిమాధురి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శారద, మండల వ్యవసాయ అధికారి రాజవర్ధన్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి కిరణ్ కుమార్ రెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చౌడేశ్వరిదేవి ఉత్సవాలు



చౌడేశ్వరీదేవికి బోనాలు సమర్పిస్తున్న గోపన్నపల్లి గ్రామ మహిళలు

**భూత్పూర్, మే 18, ప్రభాతవార్త:** భూత్పూర్ మండలం గోపన్నపల్లి గ్రామంలో యాదవుల గ్రామదేవత శ్రీచౌడేశ్వరిదేవి మాత ఉత్సవాలు ఆదివారం ఘనంగా ఆరంభమయ్యాయి. గ్రామానికి చెందిన మహిళలు, బాలికలు బోనాలతో భారీ ఊరేగింపు, ప్రదర్శన నిర్వహించి తమ మొక్కుల్ని తీర్చుకున్నారు. ఈ ఉత్సవాలకు యాదవ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరయ్యారు. హాజరైన వారిలో వెంకట నరసయ్య యాదవ్, బైకాని బాలుయాదవ్, రవికుమార్ యాదవ్, శాంతన్న యాదవ్, లక్ష్మినర్సింహ్మాయాదవ్, సాయిలు యాదవ్, అంజన్న యాదవ్, జుర్రు నారాయణ యాదవ్, బత్తుల మల్లేష్ యాదవ్, కోట్ల రాములు యాదవ్, కోట్ల రాఘవేందర్ యాదవ్, బత్తుల వెంకటేష్ యాదవ్, కోట్ల కిష్టయ్యయాదవ్, అంజలి యాదయ్య యాదవ్, కడప వెంకటనారాయణ యాదవ్, కోట్ల ఖాదరయ్య యాదవ్, కనిమోని పెంటన్న యాదవ్, కోట్ల సాయిలు యాదవ్, రాచూరి ఉషా రంగన్న తదితరులున్నారు.

## భూత్పూర్‌లో విద్యార్థులు, యువకుల ర్యాలీ

**భూత్పూర్, మే 18, ప్రభాతవార్త:** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 18 నుంచి 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తోన్న యువజన, క్రీడా వారోత్సవాల సందర్భంగా సోమవారం భూత్పూర్ పట్టణ కేంద్రంలో మండల వివిధ శాఖల ఉద్యోగులు, పోలీసులు, అధికారుల ఆధ్వర్యంలో విద్యార్థులు, యువతీయువకులు పట్టణ కేంద్రంలోని చౌరస్తాలో మారథాన్, భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారిణి ఉషారాణి, ఎంపిడీఓ ఉమాదేవి, ఎంపీఓ శ్రీదేవి, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్, భూత్పూర్ పీఎస్ ఎస్సై చంద్రశేఖర్, మండల రెవెన్యూ ఇన్స్‌స్పెక్టర్ వెంకటేష్, మున్సిపాలిటీ సూపరిన్‌టెండెంట్ నర్సింహులు, స్వచ్ఛ సర్వేచ్చన్ ఇంచార్జి శివప్రసాద్, రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

**లింగాల, మే 18, ప్రభాతవార్త:** గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని అప్పాయిపల్లి సర్పంచ్ విజయకృష్ణ అన్నారు. అప్పాయిపల్లి గ్రామ శివారులో జోరుగా సాగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో భాగంగా రైతుల పొలాల్లో ఒండ్రుమట్టిని తరలిస్తున్న తీరును సోమవారం సర్పంచ్ విజయకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పనుల వివరాలను ఉపాధి కూలీలను అడిగి తెలుసుకున్నారు. పనిప్రదేశంలో కూలీల హాజరు వేసి ఎలాంటి అవకతవకలు లేకుండా బినామీ మస్టర్ రాకుండా చూసుకునే బాధ్యత ఆయా కూలీలు చూసుకోవాలని కోరారు. పని ప్రదేశంలో నీడ, నీటి వసతి సక్రమంగా నిర్వహించాలని పలు సూచనలు ఇవ్వడం జరిగింది. దాదాపుగా 210మంది కూలీలు పనులు చేస్తుండడంసంతోషమని అన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉందని సకాలంలో పనులు ముగించుకోవాలని చెప్పారు. ఈ విధంగా కూలీలు మేము సక్రమంగా పనులు చేసుకుంటామని చుట్టుపక్కల రైతుల పొల్లల్లో ఒండ్రుమట్టిని తరలిస్తున్నామని మాకు చేసిన పనికి సక్రమంగా రేటువేయాలని కూలీలువాపోయారు. వారివెంట మెటీలు వున్నారు. ఒండ్రు మట్టి ఉప్పు చెరువు, గొర్మిళ్లకుంటలలో ఉప్పుచెరువుకు వచ్చే ఫీడర్ ఛానల్ పూడిక, బుష్ క్లీరెన్స్ పనులు చేయడం జరుగుతుందని కూలీలు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కూలీల హాజరు సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్ ప్రణాళికపై అవగాహన సదస్సు

**అచ్చంపేట, మే, 18 ప్రభాతవార్త:** విద్యార్థుల నైపుణ్యాలు భవిష్యత్ ప్రణాళికపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసుకోవడం జరిగిందని శ్రీ ఉమామహేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవి పరంగి తెలిపారు. సోమవారం బల్మూరు మండలంలోని కొండనాగుల గ్రామంలో శ్రీ ఉమామహేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్మాణ్ సంస్థతో పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రవి పరంగి మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, శిక్షణ కార్యక్రమాలు అందించడంలో ఈ ఒప్పందం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. కృష్ణ ప్రసాద్ విద్యార్థులకు కెరీర్ మార్గదర్శకత, ఇంటర్వ్యూ నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



ప్రమాదాలకు నిలయం ఈ కూడలి

**అచ్చంపేట, మే, 18 ప్రభాతవార్త:** అచ్చంపేట పట్టణంలో సాయినగర్, మధురనగర్ కాలనీల ప్రధాన రహదారిపై తక్షణమే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా సాయినగర్ కాలనీలో సాయిరాం థియేటర్ ముందు కాలనీకి వెళ్లే క్రమంలో ఇప్పటికీ చాలా ప్రమాదాలు జరిగాయి. కాలనీల నుంచి ప్రధాన రహదారిపైకి వాహనాలు వచ్చే క్రమంలో వేగ నియంత్రణ లేక నిరంతరం ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్‌బి అధికారులు స్పందించి, ఈ జంక్షన్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి

**లింగాల, మే 18ప్రభాతవార్త:** సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు లింగాల తహసిల్దార్ వెంకటేష్ తెలిపారు. సోమవారం లింగాల తాసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ ప్రజావాణిలో ఒక దరఖాస్తు స్వీకరించినట్లు తెలిపారు. దరఖాస్తు త్వరలో విచారణ చేపట్టి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ఇందిరా, ఐకెపి ఎపిఎం విజయ, పశు వైద్య అధికారి ప్రియాంక, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసులు, విద్యాశాఖ నుండి సాయి, సీనియర్ అసిస్టెంట్ తిరుపతమ్మ, జిపిఓ శివ తదితరులు పాల్గొన్నారు.

# ఏళ్ల నాటి నిరీక్షణ ఫలించింది

● మాది చేతల ప్రభుత్వం ● కాంగ్రెస్ తోనే గ్రామాల అభివృద్ధి ● దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి



కాజ్‌వే బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్

**మదనాపురం, మే 18 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కోటి రూపాయల తో దంతనూర్ నుంచి శంకరమ్మ పేట, సరళా సాగర్ ప్రాజెక్టుకి కాజ్ వే బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసియా ఖండంలో రెండవ సరళా సాగర్ ప్రాజెక్టు కు వంతెన లేక ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రజల చిరకాల కోరిక నెరవేరింది అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత విద్యుత్తు, ఆరోగ్యశ్రీ, రుణమాఫీ, సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల మంజూరు వంటి అనేక పథకాలను ప్రజలకు అందజేస్తున్నామని పేర్కొన్నారు. గత పదివేల టిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ అనే డమ్మీ పథకంతో పేదలను నిలువునా ముంచిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్, మండల సమన్వయ కమిటీ అధ్యక్షుడు మహేష్, సర్పంచులు నాగరాజు గౌడ్, శ్రీనివాస్ చారి, పోతురాజు రాములు, ఉపసర్పంచ్ శ్రావణ్‌కుమార్, దంతనూర్ గ్రామ అధ్యక్షుడు వెంటన్న, పాపని రెడ్డి, గుగ్గిల రాములు, రాజవర్ధన్ రెడ్డి , లక్ష్మీ నారాయణగౌడ్, మన్యంసాగర్, మండల నాయకులు వెంకట నారాయణ, వేమన్న, హనుమాన్‌రావు, సత్యశీలారెడ్డి, ఆవుల రాఘవేంద్ర, సాయిబాబా, శ్రీధర్ రెడ్డి, మణిర్దన్ రెడ్డి, రాజిరెడ్డి, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## విజయవంతంగా కొనసాగుతున్న కబడ్డీ శిక్షణ శిబిరం



వెల్టూర్ హైస్కూల్‌లో వేసవి శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు సహకారం అందించిన బూరం అనిల్ యాదవ్

**ఉప్పునుంతల, మే18 ప్రభాతవార్త:** వేసవికాలం రావడంతో పాఠశాలలకు సెలవులు వచ్చిన వెంటనే తమ కుటుంబ సభ్యులతో వేసవికాలం సెలవులు ముగిసిన తర్వాత పాఠశాలలు తిరిగి పునఃప్రారంభం అయ్యే వరకు కుటుంబ సభ్యులతో విలాసం చేయాలని ఎంతో ఉత్సాహం చూపిస్తుంటారు. కానీ మండలంలోని వెల్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్ విద్యార్థులకు విద్యతో పాటు వ్యాయామం అతి ప్రాముఖ్యమని భావించి విద్యార్థులను క్రీడల్లో ముందుకు తీసుకెళ్లాలని లక్ష్యంతో బడి కి సెలవులు ఇచ్చినప్పటి నుంచి నేటి వరకు పాఠశాల ఆవరణలో నిత్యం విద్యార్థులకు క్రీడలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. సమ్మర్ హాలిడే లో వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్ విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహన్ని గ్రామస్తులు వ్యాయామ ఉపాధ్యాయునికి గ్రామస్తులు పూర్తిగా సహకారం అందిస్తూ వస్తున్నారు. గత 24 రోజుల నుంచి వేసవి కబడ్డీ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. వేసవికాలంలో నిర్వహిస్తున్న కబడ్డీశిక్షణ శిబిరానికి విచ్చేసిన క్రీడాకారులకు స్వాగతం పలుకుతూ, కబడ్డీ క్యాంప్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు. క్రీడాకారులకు కావలసిన మౌలిక వసతులను కల్పించేందుకు గ్రామస్తులు ఆర్థిక సహకారం అందిస్తున్నారు. అందులో భాగంగా గ్రామానికి చెందిన బూరం అనిల్ యాదవ్ శిబిరాన్ని సందర్శించి శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు రూ. 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా క్యాంపులో విద్యార్థులకు కావలసిన కూరగాయలు అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ఆర్థిక సహకారంతో పాటు కూరగాయలు అందజేయడం తో వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్ బూరం అనిల్ యాదవ్ ను శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్, బూరం అనిల్ యాదవ్, గ్రామ యువకులు సమద్ , శిక్షణ పొందుతున్న క్రీడాకారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు




తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన అధికారులు

**ఉప్పునుంతల, మే 18 ప్రభాతవార్త:** గ్రామస్థాయిలో నెలకొన్న ఇబ్బందులను స్థానికతహసిల్దార్ కార్యాలయం లో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నప్పటికీ మండల స్థాయి అధికారులు అన్ని విభాగాలు హాజరు కాకపోవడం పట్ల మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలు ఎవరికి చెప్పాలని, వారానికోసారి జరిగే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కాకపోవడం పట్ల తమ సమస్యలు ఎవరికి చెప్పాలో తెలియక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని శాఖల అధికారులు పూర్తిగా ప్రజావాణి ని విస్మరిస్తున్నారు. కొన్ని శాఖల అధికారులు ప్రతి వారం జరిగే ప్రజా వాణికి హాజరవుతు న్నప్పటికీ మండలంలో ఉన్న అన్ని శాఖల అధికారులు హాజరు అయితే తమ సమస్యలు నేరుగా చెప్పులేకున్నా వినతి పత్రం ద్వారా సమర్పించడానికి వీలుంటుందని, జిల్లా కేంద్రంలో విజయవంతంగా నడిపిస్తున్నప్పటికీ మండల స్థాయిలో అధికారుల నిర్లక్ష్యంతోప్రజావాణి కార్యక్రమం పూర్తిగా విఫలమవుతుందని చెప్పవచ్చు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని ఉప్పునుంతల మండలంలో ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమానికి అన్నివిభాగాల అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతు న్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఈ పాషా, పావని, ఎఎస్ఐ బ్రహ్మయ్య, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ బాల్ రాం నాయక్, వైద్యశాఖ ప్రతినిధులు కుమార్ ఆచారి, మధు నాయక్, పశు వైద్య అధికారి డా. ప్రవీణ్ కుమార్, జిపిఓలు ఉమా, వెంకటేష్, ఇరిగేషన్ కార్యాలయం ప్రతినిధి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## వరుస దొంగతనాలకు పాల్పడిన ముసుగు దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ డా.వినీత్



నిందితుని నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులు

**నారాయణపేట, మే18 ప్రభాతవార్త:** మక్తల్, మరికల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని మక్తల్ పోలీసులు అరెస్ట్ చేసి భారీ మొత్తంలో నగదు, బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ డా.వినీత్ తెలిపారు. సోమవారం నిర్వహించిన పత్రికా సమావేశంలో నిందితుడి వివరాలను వెల్లడించారు. 18 మే 2026 తెల్లవారుజామున మక్తల్ ఎస్ఐ వై. భాగ్యలక్ష్మి రెడ్డి ఆధ్వర్యంలో నారాయణపేట క్రాస్ రోడ్డులో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, ద్విచక్ర వాహనంపై వచ్చిన వ్యక్తి పోలీసులను చూసి అనుమానాస్పదంగా బైక్ వదిలేసి పారిపోవడానికి ప్రయత్నించాడు. పోలీసులు వెంటాడి అదుపులోకి తీసుకుని విచారించగా అతను కర్రెం సూర్యనారాయణ అలియాస్ తిమ్మప్ప అలియాస్ తిప్పి అలియాస్ సూర్య (27), అంబేద్కర్‌నగర్ కాలనీ, మక్తల్‌కుచెందిన వ్యక్తిగా గుర్తించారు. విచారణలో నిందితు డు గత ఏడాది కాలంగా మక్తల్, మరికల్ ప్రాంతాల్లో మొత్తం10 దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించాడు. వీటిలో 9 కేసులు మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలో, ఒక కేసు మరికల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసైననిందితుడు డబ్బుల కోసం దొంగతనాలు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. పగటి సమయంలో షాపులు, వైన్ షాపులు, తాళం వేసిన ఇళ్ల వద్ద రెక్కీ నిర్వహించి, రాత్రి మంకీ క్యాప్, గ్లౌజులు ధరించి ముసుగు వేసుకుని ఎలక్ట్రిక్ కట్టర్, సుత్తి, కట్టింగ్ ప్లేయర్స్, స్క్రూడ్రైవర్లతో తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడే వాడని తెలిపారు. నిందితుడి నుంచి రూ.5.04 లక్షల నగదు, 13 గ్రాముల బంగారం, 60 తులాల వెండి, రెండు మొబైల్ ఫోన్లు, సిగరెట్లు స్వాధీనం చేసుకు న్నారు. మొత్తం స్వాధీనం చేసిన ఆస్తి విలువ రూ.9.19 లక్షలు ఉన్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఇళ్లు, వ్యాపార సంస్థలకు బలమైన తాళాలు ఏర్పాటు చేసుకోవాలని, సీసీ కెమెరాలుఏర్పాటు చేసుకోవాలని జిల్లాఎస్పీ సూచించారు అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్100కు సమాచారం ఇవ్వాలని కోరారు. కేసులను ఛేదించిన పోలీసు అధికారులకు ప్రశంసాపత్రాలు, రివార్డులు అందజేస్తామని తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో లొకేషన్ పై తలలు పట్టుకుంటున్న అధికారులు



పిరట్వాన్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహిస్తున్న ఉప తహసీల్దార్ రమేష్

**ఉప్పునుంతల, మే 18 ప్రభాతవార్త:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని విజయవంతం చేసేందుకు ఇందిరమ్మ ఇండ్ల సర్వే సైటు గ్రామస్థాయిలో లొకేషన్ తీసుకొని మండల స్థాయి అధికారులకు అప్పగించాలని ఆదేశాలు జారీ చేయడంతో మండల స్థాయి అధికారులు సర్వే నిర్వహించారు. కానీ ఇందిరమ్మ ఇండ్ల సైట్ లో తీసుకున్న లొకేషన్ మండల స్థాయి అధికారులు నిర్వహిస్తున్న విచారణలో ఇందిరమ్మ ఇండ్ల సైట్ లో తీసుకున్న లొకేషన్ సరిపడక తలలు పట్టుకున్నారు. లబ్ధిదారులు నివసించే ఏరియా ఒకటి ఉంటే ఇందిరమ్మ ఇండ్ల సైట్ లో ఇందిరమ్మ ఇండ్ల కోసం తీసుకున్న లొకేషన్ సరిపోకపోవడం, సైట్ లోమరొక ఏరియా ఇవ్వడం రెండు ఏరియా లు మ్యాచింగ్ కాకపోవడంతో ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేయడానికి వెళ్లిన అధికారులు పూర్తి స్థాయిలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇందిరమ్మ ఇండ్ల సైట్ ఆధారంగా గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో జాగ్రత్తలు తీసుకొని లొకేషన్‌లో ఎలాంటి పొరపాటు జరగకుండా చూడాలని ఉప తహసీల్దార్ రమేష్ వివరించారు. సోమవారం మండలంలో ని పిరట్వాన్ పల్లి నిర్వహించిన సర్వేలో ఇందిరమ్మ ఇళ్ల సైట్ లో ఇచ్చిన లొకేషన్, మాకు అందించిన లొకేషన్ మ్యాచింగ్ కావడం లేదని ఆయన వివరించారు.

## యువత ఫిట్ అండ్ యాక్టివ్‌గా ఉండాలి

రాజాపూర్ సర్పంచ్ కావలి రామకృష్ణ




**రాజాపూర్, మే 18 ప్రభాతవార్త :** నేటి యువత చదువుతో పాటు ఫిట్ అండ్ యాక్టివ్‌గా ఉండాలని రాజాపూర్ గ్రామ సర్పంచ్ సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు కావలి రామకృష్ణ అన్నారు. సోమవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మారథాన్ రన్ లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీదేవి, ఎంఈఓ సుధాకర్, ఎంపిఓ వెంకట్ రాములు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నార్కోటిక్ జాగిలం రుద్ర సహాయంతో

## మత్తుపదార్థాలపై సెర్చ్

● డీఎస్పీ వెంకటేశ్వర్లు



తనిఖీలు చేస్తున్న పోలీస్ సిబ్బంది

**మహబూబ్‌నగర్, మే 18, ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాల మేరకు సోమవారం మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నార్కోటిక్ జాగిలం రుద్ర" సహాయంతో మత్తుపదార్థాల తనిఖీలు నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లాను డ్రగ్ ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు, సామగ్రిని జాగిలంద్వారా క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తుపదార్థాల విక్రయాలు లేదా వినియోగంపైసమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియ జేయాలని సూచించారు. కార్యక్రమంలో డిసిఆర్‌బి డీఎస్పీ రమణారెడ్డి, టూటౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజ్ ఉద్దీన్, ఆర్ఐ కృష్ణయ్య, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ గౌటాన్ భూమిని గుర్తించండి

**రాజాపూర్, మే18 ప్రభాతవార్త:** రాజాపూర్ మండలంలోని రంగారెడ్డి గూడ గ్రామంలో ప్రభుత్వ భూమి, గౌటాన్ ఎంత భూమి ఉందో గుర్తించి హద్దురాళ్ళను ఏర్పాటు చేయాలని రంగారెడ్డి గూడ గ్రామ సర్పంచ్ రేవతి భర్త కాటేపాగ ఆనంద్ సోమవారం జిల్లా కలెక్టర్‌ఖుష్బూ గుప్తాకు వినతిపత్రం అందజేశారు. సంబంధిత అధికారుల చేత సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేస్తే ప్రభుత్వ కార్యాలయాలఏర్పాటు కోసం అవసరం ఉంటుందని కలెక్టర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నట్లు ఆనంద్ తెలిపారు.

## ముందరి తండాలో నీటి దాహార్తిని తీర్చిన ఎమ్మెల్యే మెగారెడ్డి



**పెద్దమందడి, మే 18 ప్రభాతవార్త:** పెద్దమందడి మండల పరిధిలోని ముందరి తండాలో నీటి ఇబ్బంది ఉందని ఎమ్మెల్యే మెగారెడ్డికి కాలనీవాసులు సమాచారం ఇచ్చారు. ఎమ్మెల్యే స్పందించి ముందరితండలో నీటి సమస్యను పరిష్కరించేందుకు కొత్త బోరు వేయించారు. నీటి ఇబ్బందులను తొలగించినందుకు ఎమ్మెల్యే మెగా రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మేఘావత్ కిషన్ నాయక్, నాయకులు మెగా మమత మూడవ కిషన్, సభావత్ రాములు, సవార్డ్ గౌడు, తాండవాసులు తదితరులు పాల్గొన్నారు.

## రాజాపూర్‌లో శ్రీదత్త హాస్పిటల్ ప్రారంభం

**రాజాపూర్, మే18 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని కుచ్చర్కల్ గ్రామ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ దత్తా హాస్పిటల్ ను సోమవారం రాజపూర్ గ్రామ సర్పంచ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు కావలి రామకృష్ణ, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాతృమూర్తి జనంపల్లి శశికళ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజాపూర్ మండల కేంద్రంలో ఎంబిబిఎస్ జనరల్ ఫిజీషియన్ సేవలు రావడం అభినందనీయమన్నారు. రాజాపూర్ మండల కేంద్రంలో నూతనంగా ఆసుపత్రిని నెలకొల్పిన ఎంబిబిఎస్ డా. మౌనికను వారు ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ గ్రామ సర్పంచ్ పూజారి శేఖర్, సింగమ్మగుడా గ్రామ సర్పంచ్ రాఘవేందర్ నాయక్, ఏఎంసీ డైరెక్టర్ వనపర్తి రమణ, వనపర్తి నరహరి, గణేష్ నాయక్, బిల్డింగ్ యజమాని డీలర్ నారాయణ, ఆసుపత్రి సిబ్బంది తదితరులు ఉన్నారు.

## మక్తల్ క్రీడా ప్రాంగణంలో యువజన క్రీడా వారోత్సవాలు



**మక్తల్ టౌన్, మే18 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణం నందు యువజన క్రీడా వారోత్సవాలు నిర్వహించిన జిల్లా యువజన, క్రీడల శాఖవారు విజయవంతంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా యువజన, క్రీడల శాఖ వారి ఆధ్వర్యంలో "ఫిట్ యాక్టివ్ తెలంగాణ" లో భాగంగా నేడు మక్తల్ క్రీడా ప్రాంగణం నందు 2 కే రన్ ను నిర్వహించడమైనది. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా మున్సిపల్ చైర్ పర్సన్ మానస, మున్సిపల్ కౌన్సిలర్స్ పావని, కోల వెంకటేష్, మక్తల్ పట్టణ కాంగ్రెస్ ప్రెసిడెంట్ రవి కుమార్ పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి ఆర్డీవో రాజేందర్‌గౌడ్, డిపిఆర్ఓ నారాయణపేట రషీద్ , డివైస్ ఓ వెంకటేష్ తదితరులు పాల్గొని 2కే రన్ విజేతలకు జ్ఞాపికను అందజేయడం జరిగినది.

## చెరువులో చేపలు చనిపోవడంపై మత్స్యకారుల ఆవేదన

**అచ్చంపేట, మే18, ప్రభాతవార్త:** అచ్చంపేట మండల పరిధిలోని లింగోటంగ్రామంలో ఊరకుంట చెరువులో చేపలు చనిపోవడంపై మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు లక్ష యాభై వేలు నష్టం జరిగినట్లు వారు తెలిపారు. ఈ చేపలు చనిపోవడానికి అచ్చంపేట నుండి వస్తున్న మురుగు నీరు చెరువులో కలవడమా లేదా ఏమైనా విషప్రయోగం జరిగిందా అనే దానిపై మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు. కలుషితమైన నీరుతో ఊపిరి ఆడక చేపలు చనిపోయి ఉండవచ్చని గ్రామ యువకులు కొందరు అనుమానిస్తున్నారు.



చనిపోయిన చేపలు

## రెడ్ క్రాస్ సేవలు మరింత విస్తృతపరచాలి

### నెలరోజుల పాటు సభ్యత్వ నమోదు : జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



సభ్యత్వాన్ని నమోదు చేసుకున్న కలెక్టర్ కుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే18, ప్రభాతవార్త:** జిల్లాలో రెడ్ క్రాస్ సేవలు మరింతగా విస్తరిం చేందుకు గాను విస్తృత స్థాయిలో రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పిలుపు నిచ్చారు. మే 15 నుండి జూన్ 15 తేది వారకు నెల రోజుల పాటు నిర్వహించే రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం మహబూబ్‌నగర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(ఐడిఓసి )కాంప్లెక్స్, 2వ అంతస్తు, 224 గది లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రి డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసిన తదుపరి కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌జె.సువర్ణరాజ్ మొదటి సభ్యత్వాన్ని అందజే శారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని శాఖాధికారులు రెడ్ క్రాస్ సభ్యత్వా లను నమోదు చేసుకొని,నెలరోజుల పాటు నిర్వహించనున్నఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.జిల్లాలోని ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చిరెడ్‌క్రాస్ సభ్యత్వం స్వీకరిం చి రెడ్ సేవా కార్యకమాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఐఆర్‌సీఎస్ చైర్మన్ డా. ఎల్.ఎన్. ఏ. నటరాజ్, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జె. సువర్ణ రాజ్, జిల్లా ఉపాధి అధికారి మైత్రి ప్రియా, కార్మిక శాఖ ఉప కమిషనర్ చంద్రశేఖర్, ఐఆర్‌సీఎస్ కోశాధికారి జగపతి రావు, మేనేజింగ్ కమిటీ సభ్యులు శ్రీహరి, తిరుపతి రెడ్డి, డా.సి.బాబుల్ రెడ్డి, జేఆర్‌సీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెట్రోల్‌పై వ్యాట్ ఎందుకు తగ్గించలేదు

◆ సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు చెప్పాలి ◆ బిజెపి రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్



**మహబూబ్‌నగర్, మే 18, ప్రభాతవార్త:** భారతదేశంలోనే పెట్రోల్ డీజిల్ ధరలు అత్యధికంగా ఉన్న రాష్ట్రం తెలంగాణ అని, పెట్రోల్ పై రాష్ట్ర ప్రభుత్వం వ్యాట్ ఎందుకు తగ్గించడం లేదో ప్రజలకు చెప్పాలని బిజెపి రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్ డిమాండ్ చేశారు. సాధారణంగా పెట్రోల్ రిఫైనరీ పేస్ కాస్ట్ ఒక్క లీటర్ కు రూ.52 నుంచి 56 ఉందన్నారు. డీలర్ కమిషన్ రూ.నాలుగు నుంచి ఐదు వరకు ఉందని, కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీ రూపాయలు ఆరు నుంచి ఏడు ఉందని తెలిపారు. పని తెలంగాణ ప్రభుత్వం ప్రతి లీటర్ పై 35.20శాతం పన్ను వసూలు చేస్తుందని చెప్పారు. ఒక లీటర్ పై రూపాయలు మూడు పెరిగితే కూడా అందులోనూ 35.20శాతం పన్ను రూపంలో తెలంగాణ ప్రభుత్వానికే వెళుతుందన్నారు. నిత్యం కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించే సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్ పై వ్యాట్ ఎందుకు తగ్గించదు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

## శ్రీమల్లికార్జున నాటకానికి ప్రోత్సాహకం అందజేత

**వెల్దండ, మే 18 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని పోతేపల్లి గ్రామంలో నాట్యమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ మల్లికార్జున నాటకానికి గ్రామ సర్పంచ్ తగుళ్ల కొండల్ యాదవ్ రూ.15వేలు విరాళంగాఅందించారు. ఈ సందర్భంగా కొండల్ యాదవ్ మాట్లాడుతూ మల్లికార్జున నాటకం వంటి సంప్రదాయ కళారూపాలు మన సంస్కృతిని ప్రతిభింబిస్తూ, కొత్త తరాలకు ఆధ్యాత్మిక విలువలను చేరవేస్తాయని అన్నారు. కార్యక్రమంలో నాట్యమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి మొక్కను బ్రతికించాలి : ఎంపీడీఓ కృష్ణయ్య



వన నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న దృశ్యం

**వెల్దండ, మే 18 ప్రభాతవార్త:** వేసవికాలం దృష్ట్యా నర్సరీలో పెంచుతున్న ప్రతి మొక్కను సంరక్షించాలని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. వెల్దండ మండలంలోని కంటోనిపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులలో భాగంగా ధనకుంటలో పుడకతీత పనులను పరిశీలించి కూలీలకు ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. ప్రతిరోజు ఉదయం 6 గంటల వరకు పనికి వచ్చి కొలతల ప్రకారం పని ముగించుకొని త్వరగా ఇంటికి వెళ్లాలని, పని ప్రదేశంలో సేద తీరేందుకు నీడ, త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఏర్పాటు చేయాలని సర్పంచ్ మమత లక్ష్మణ స్వామికి సూచించారు. గ్రామంలో లబ్ధిదారులు నేర్పించుకుంటున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. గ్రామానికి మంజూరు చేసిన 9 ఇందిరమ్మ ఇండ్లను జూన్ 2వ తేదీ నాటికి గృహప్రవేశాలు చేయాలని, గ్రామంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మణ్, ఏపీవో ఈశ్వర్, పంచాయతీ కార్యదర్శి ఫయాజ్, ఉప సర్పంచ్ శివకుమార్, మేటి ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

## రైతులకు గన్ని బ్యాగుల కొరత తీర్చాలి

◆ సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి రమేష్

**వనపర్తి రూరల్, మే 18, ప్రభాతవార్త:** వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న రైతులకు లారీలు, గన్ని బ్యాగుల కొరత తీర్చాలని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. శ్రీరామ్ డిమాండ్ చేశారు. సోమవారం వనపర్తి మార్కెట్ యార్డును సందర్శించి మొక్కజొన్న,వరి రైతుల ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వనపర్తి మార్కెట్ యార్డులో మొక్కజొన్నలు కొనుగోలు చేయలేక అలాగే ఉండిపోయాయని తెలిపారు. కొన్నింటికి తూకం వేసి నెలరోజులైనా లారీలు రాక తరలించలేదని రైతులు వాటి వద్ద రాత్రి పగలు కావలి కాస్తున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద మొత్తంలో మొక్కజొన్నలు అలాగే ఉన్నాయని, గన్ని బ్యాగులు లేక తూకాలు వేయడం లేదని,ఖాళీ సంచులు తెస్తే తూకం వేస్తామని అధికారులు చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఖాళీ సంచులు కొనాలని ఘనపురం మండలం అప్పారెడ్డిపల్లి రైతుల నుంచి 1100 ఖాళీ సంచుల కోసం రూ. 33000 వసూలు చేశారన్నారు. వరి, వేరుశనగ రైతులకు ఉచితంగా ఖాళీ సంచులు ఇస్తున్నారని మొక్కజొన్న రైతుల వద్ద డబ్బులు వసూలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. డబ్బులు వాపస్ ఇవ్వాలని తగినన్ని ఖాళీ సంచులను ఉచితంగా సరఫరా చేయాలన్నారు. మద్దతు ధర రూ.2400 కొంత సరుకు మాత్రమే కొన్నారని, మిగిలిన వాటిని రైతులు రూ. 1700 లకే ప్రైవేటు వారికి అమ్ముతున్నారని మొత్తం సరుకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో రైతులను సమీకరించి ధర్నా చేస్తామని హెచ్చరించారు.

## సిలార్‌పల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**కల్వకుర్తి, మే 18 ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపాలిటీలోని 6వ వార్డులో సోమవారం కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగిఆనంద్‌కుమార్,మాజీ కౌన్సిలర్ చిగుల్లపల్లి సతీష్‌తో కలిసి పర్యటిం చారు. గ్రామంలో నెలకొన్న సమస్యలనుగ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డినారాయణరెడ్డి సహకారంతో మంజూరైనా సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. సిలార్‌పల్లి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పుట్ట రేణుక రాజశేఖర్, నాయకులు శ్యాం సుంధర్ రెడ్డి, గుర్రాల జంగారెడ్డి, పాండు రంగారెడ్డి, పుట్ట వెంకటయ్య, పెద్ద రాంరెడ్డి, భీమయ్య, జంగయ్య, దున్న భాస్కర్ తదితరులు ఉన్నారు.



గ్రామంలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న దృశ్యం

## భద్రతా ప్రమాణాలతో పాఠశాల భవనాలు నిర్మించాలి

- గ్రామీణ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యా సౌకర్యాలు
- నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి కల్పన ప్రభుత్వ లక్ష్యం
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనుల ప్లాన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే18 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తూడుకుర్తి గ్రామంలో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను సోమవారం జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షి యల్ పాఠశాల భవన నిర్మాణంలో తరగతి గదులు, వసతి గృహాలు, ప్రయోగశాలలు, భోజనశాల, పారిశుధ్య సదుపా యాలు తదితర అంశాలను నిశితంగా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాటా ్లడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యా సౌకర్యాలనుఅందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ విద్యార్థులు కూడా నగర స్థాయి విద్యా అవకాశాలను పొందేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. విద్యార్థుల భవిష్య త్తును దృష్టిలో ఉంచుకొని పాఠశాల నిర్మాణ పనులను అత్యు త్తమ నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని సంబంధిత అధికారుల కు, కాంట్రాక్టర్లకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఆలస్యం చోటుచేసుకోకుండా నిరంతరం పర్య వేక్షణ కొనసాగించాలని సూచించారు. నిర్మాణ పనుల పారద ర్శకత కోసం పనుల ప్రాంగణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. పాఠశాల భవన నిర్మాణంలో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిం చాలని, ప్రతి గది విద్యార్థులకు అనుకూలంగా, సౌకర్యవంతంగా ఉండేలా నిర్మించాలని, ముఖ్యంగా హాస్టల్ గదులు, తాగునీటి వసతి, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయాలు, క్రీడా మైదానాలు వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశిం చిన గడువులోగా నిర్మాణ పనులను పూర్తి చేసి విద్యార్థుల తరగ తుల నిర్వహణకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదే శించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి,భద్రతా, ప్రశాంతమైన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా స్థాయి ప్రజా పాలన సభను విజయవంతం చేయాలి : జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 18 ప్రభాతవార్త:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయడంలో అధికారులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ నెల 22వ తేదీన జిల్లా స్థాయిలో నిర్వహించనున్న ప్రజా పాలన సభను ప్రతిష్ఠా త్మకంగా నిర్వహించాలని అన్ని శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశించారు. సోమవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలోఅదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయంలతో కలిసి జిల్లా స్థాయిలో నిర్వహి ంచే ప్రజా పాలన సభ నిర్వహణపై అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన నిర్వహించే ప్రజా పాలన జిల్లా స్థాయి సభను నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని తేజ కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే సభకు ఎలాంటి ఇబ్బందులు లేకుండాఅన్ని ఏర్పాట్లు పక్కాగా నిర్వహిం చాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే సంక్షేమ పథకాలను జిలాస్థాయిలో ప్రజలకు పూర్తిస్థాయి అవగా హన కల్పించాలని, లబ్ధిదారులు హాజరు తదితర అంశాలపై కలెక్టర్ శాఖల వారీగా ఆదేశాలు జారీ చేశారు. జిల్లా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత చేరువ చేయడం, ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కార మార్గాలు చేపట్టడం ఈ సభ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఇందుకోసం ప్రతిశాఖ తమకు సంబంధించిన వివరాలను సమగ్రం గా సిద్ధం చేసి జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారికి అందజేయాలని, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పథకాలు లబ్ధిదారుల వివరాలను వెల్లడిం చేలాఏర్పాటు చేయాలన్నారు. వేదిక ఏర్పాటు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత శాఖలకు సూచించారు.

ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ప్రత్యక్షంగా తెలియజేయడంలో ఈ సభ కీలక వేదికగా నిలుస్తుందని కలెక్టర్ తెలిపారు. సభకు జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మున్సిపల్ చైర్మన్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు ప్రజా ప్రతినిధులు సభకు హాజరయ్యేలా ఆ స్థాయిలోని అధికారులు ఆహ్వానాలను అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు.అన్ని శాఖల జిల్లా స్థాయి డివిజన్ స్థాయి మండల స్థాయి అధికారులు హాజర య్యేలా అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో డిప్యూటీ సీఈవో గోపాల్ నాయక్ నాగర్ కర్నూల్ ఆర్ డిఓ సురేష్ బాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు,సంబంధితవిభాగాల సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

## రాష్ట్ర విపత్తు స్పందన దళం మాక్ డ్రిల్



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న వివిధ శాఖల సిబ్బంది

**మక్తల్ టౌన్, మే18 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణంలో విపత్తు నిర్వహణ సంస్థ అగ్నిమాపక సిబ్బంది ఎల్లమ్మ కుంటలో నిర్వహించారు. విపత్తులు, బారి వరదల సమయంలో ప్రజల ప్రాణాలను ఎలా కాపాడాలో వారు ప్రాక్టికల్ గా వ్యక్తులను స్ట్రక్చర్ పై పడుకోపెట్టి లైఫ్ జాకెట్లు వేసి వాళ్లను అంబులెన్స్ లో ఎక్కించి ప్రథమ చికిత్స అందించే విధంగా చర్యలు తీసుకు న్నారు. ఎల్లమ్మ కుంట ప్రాంతంలోని మహిళలు స్థానిక ప్రజలు ఎక్కువ సంఖ్య లో పాల్గొని ఉత్సాహంగా తిలకించారు. విపత్తుల సమయంలో మా సిబ్బంది మిమ్మల్ని ఎలా కాపాడాలో తెలియ చెప్ప డానికి ప్రజలకు అవగాహన కలిగించడం కోసమే ఈ కార్యక్రమం నిర్వహించామని అగ్నిమాపక సిబ్బంది తెలియజేశారు. ప్రకృతి వైపరీత్యాలు,వరదల వంటి ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సన్నద్ధంగా ఉందని అధికారులు తెలియజేశారు.పట్టణంలో ఎల్లమ్మ కుంటలోజాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) ఆదేశాల మేరకు రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్‌డీఆర్‌ఎఫ్) ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. భారీ వరదలు వచ్చిన సందర్భంలో ప్రజలను ఎలా రక్షి ంచాలి, అత్యవసర పరిస్థితుల్లో స్పందనా బృందా లు ఎలా పనిచేయాలనే అంశాలపై ఈ మాక్‌డ్రిల్ చేపట్టారు. వరదల కారణంగా ముంపునకు గురై చిక్కుకున్న ప్రజలను ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖ సిబ్బంది బోటులు, లైఫ్ జాకెట్ల సహాయంతో సురకిత ప్రాంతాలకు తరలించే విధానాన్ని పూర్తి స్థాయిలో ప్రదర్శించారు. అలాగే బాధితులకు ప్రథమ చికిత్స అందించి అంబులెన్సుల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలను ప్రత్యక్షంగా చూపించారు. ఈ సందర్భంగా అగ్ని మాపక అధికారులు మాట్లాడుతూ విపత్తుల సమయంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలను రక్షించేందుకు సిద్ధంగా ఉన్నా యని తెలిపారు. ప్రజలు కూడా వరదల సమయంలో అప్రమత్తంగా ఉండి అధికా రుల సూచనలు పాటించాలని సూచిం చారు. అనంతరం మక్తల్ స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహించిన ఈ మాక్‌డ్రిల్ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, నీటిపారుదల శాఖ, మున్సిపల్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లాసంగా .. ఉత్సాహంగా సాగిన 2కే రన్



2కె రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న పుర చైర్మన్ అక్కి శ్రీనివాస్‌గౌడ్

**పెబ్బేరు,మే 18 ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వ హిస్తున్న యూత్, స్పోర్ట్స్ వారోత్సవాలు పెబ్బేరు పట్టణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా సోమవారం పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో భారీ 2కేరన్ నిర్వహించారు. యువతలో క్రీడా స్ఫూర్తిని, శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్య క్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ జెండా ఊపి2కే రన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా యువ తను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ క్రీడా వారోత్స వాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత కేవలం చదువులకే పరిమితం కాకుండా క్రీడల్లో కూడా రాణిం చాలని, శారీరక మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహద పడతాయని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పట్టణంలో క్రీడామౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. చైర్మన్ పిలుపుతో పెబ్బేరు పట్టణ యువతీ యువకులు, విద్యా ర్థులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి 2కే రన్‌లో ఉత్సా హంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై వెంకటేష్‌గౌడ్,ఎంపీడీవోవెంకటేష్, ఎంఈఓ జయ రాములు, ఎంపీఓ రోజా మార్కెట్ వైస్ చైర్మన్ ఎద్దుల విజయ వర్ధన్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు జములమ్మ దాసరీ రాముడు, పర్వీన్ షకీల్, వెంకట్ రాములు, దయాకర్ రెడ్డి, యుగంధర్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ మోతేరాములు,బుర్రమోని రాములు యాదవ్, మాజీ డైరెక్టర్‌రాములు,ఉపాధ్యాయ సంఘం సభ్యులు, కేఎల్‌ఆర్ స్పోర్ట్స్,శంకర్,దామోదర్, అకాడమీ క్రీడాకారులు వివిధ సంఘాలనాయకులు, మున్సిపల్ అధికారులు, క్రీడా కారులు, పట్టణ ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.

## ప్రజా సమస్యలపై ఉద్యమించాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జబ్బార్

**వీపనగండ్ల మే 18,ప్రభాతవార్త:** ప్రజా సమస్యలపై సిపిఎం పార్టీ కార్యకర్తలు స్పందించి పోరాటాల నిర్వహించాలని సిపిఎం పార్టీ వనపర్తి జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డిజబ్బార్‌కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వీపనగండ్ల, చిన్నంబాయి మండల కమిటీ ల ఆధ్వర్యంలో మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు గోపాల్ దిన్నె గ్రామంలో సోమవారం నాడు ప్రారంభించారు.మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం అధికారంలోవచ్చినప్పటి నుండి ప్రజా వ్యతిరేకవిధానాలు అవలంబించడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందుల గురవుతున్నారు. ఆయిల్, గ్యాస్ సంక్షోభం వల్ల ప్రతి వస్తువుల ధరలు పెరగడం జరిగిందనివారన్నారు.బిజెపి ప్రభుత్వం ప్రజలకు బారాలు వేసే విధంగా ప్రయత్నం చేస్తుందని అంటూ కార్మికులకు వ్యతిరేకంగా లేబర్ కోడ్ లు తీసుకురావడం, వ్యవసాయంలో విద్యుత్ చట్టం, ఇతర నమస్కారనలు తీసుకురావడం, ఉపాధి హామీ పథకాలు పేరు మార్చి, బడ్జెట్ తగ్గించి ఈ పథకం నిర్వీర్యం చేయాలని చూస్తుంది. అనే వారు తీవ్రంగా వ్యతిరేకించారు నిరుద్యోగులకు సంవత్సరానికి రెండు కోట్లు ఉద్యోగాలు అవకాశాలు కల్పిస్తాను అని మోసగించడం జరిగిందని తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని వడ్ల కొనుగోలులో జరుగుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి డి బాల్ రెడ్డి, జిల్లా నాయకులు ఆది, మండల కార్యదర్శి వర్గ సభ్యులు రవి ప్రసాద్, చిన్నంబాయి మండల కన్వీనర్ వెంకటేష్, మండల నాయకులు బాలు గౌడ్, వి. కృష్ణయ్య, నాగరాజు, నిరంజన్, ఆశన్న, గోపాల్ దీన్ని గ్రామ ఉప సర్పంచ్ వెంకటయ్య, గ్రామ నాయకులు శేఖర్ రెడ్డి, భాస్కర్ ,చంద్రయ్య ,అబ్దుల్లా, రామారావు, రంగస్వామి గౌడ్, లక్ష్మి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

### వాకిటి శ్రీహరి అన్న సేవాసమితి ఆధ్వర్యంలో

## ఉచిత కంటి వైద్య శిబిరం

**మక్తల్ టౌన్, మే18 ప్రభాతవార్త:** మక్తల్ మండలం రుద్రసముద్రం గ్రామంలో 19వ తేదీ మంగళవారం వాకిటి శ్రీహరి అన్న సేవా సమితి,రుద్రసముద్రం సర్పంచ్, కాంగ్రెస్ నాయకుల సహకారంతో పాలమూరు రాంరెడ్డి కంటి ఆసుపత్రి సౌజన్యంతో రుద్ర సముద్రం గ్రామ పంచాయతీ ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిం చడం జరుగుతుందని వాకిటి శ్రీహరి అన్న సేవా సమితి వ్యవ స్థాపకులు అల్యూరి రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మక్తల్ మండలంలోని రుద్ర సముద్రం పరిసర ప్రాంతాల ప్రజలు ఉచితకంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసు కోవాలని సూచించారు. కంటి సమస్యలున్న వారికి వైద్యులు సూచించినమేరకుఉచితంగాశస్త్ర చికిత్సలు నిర్వహించడంతో పాటు ఉచిత భోజన,రవాణా ఖర్చులు, ఉచిత మందులను సైతం అందజే యడం జరుగుతుందని అన్నారు. పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**లింగాల,మే18, ప్రభాతవార్త :** మృతి చెందిన బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంబటి పల్లిసర్పంచ్ అతినారపు శివకుమార్ ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేసి తన దాతృత్వాన్ని చాటుకు న్నారు. మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో సేవకుల బాల స్వామి మృతి చెందారు. అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాలిగా పనిచేస్తున్న మల్లమ్మ భర్త సేవకుల బాలస్వామి మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్నసర్పంచ్ అతినారపు శివకుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేలు అందించారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఆయన వెంట ఉప సర్పంచ్ గుద్దటి కృష్ణయ్య, అతినారపు శ్రీను, వార్డు సభ్యులు సుధీర్ గౌడ్, రఘుపతయ్య తదితరులు ఉన్నారు.

## పెద్దమందడి మండలంలో హెచ్‌ఎల్‌బి మ్యాపుల సమర్పణ



**పెద్దమందడి, మే 18 ప్రభాతవార్త :** భారత జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా పెద్దమందడి మండల పరిధిలోని మద్దిగట్ల అమ్మపల్లి, తండాల ప్రాంతాలకు సంబంధించిన హెచ్‌ఎల్‌బి 66, 67,68,69,70,71,72,73,74 మ్యాపులను ఎన్‌యు మారేటర్లు రూపొందించగా వాటిని పరిశీలించి ధ్రువీకరించిన అనంతరం పెద్దమందడి మండల తహసిల్దార్,చార్జ్ ఆఫీసర్ అయిన ప్రాందు నాయక్‌కి సూపర్వైజర్‌గద్వాల కృష్ణ సమర్పించారు. ఈ సంద ర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ జనగణన 2027 విజయవంతం కావడానికి ప్రజలు ఎన్యుమరేటర్లు, సూపం ్వైజర్లు పూర్తి సహకారం అందించాలని కోరారు. సరైన సమాచారం అందించడం ద్వారా ప్రభుత్వానికి ఖచ్చితమైన గణాంకాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్య ప్రకాష్ టెక్నికల్ ఫీల్డ్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పునుంతల ఎస్ఐగా పి.మహేష్

**ఉప్పునుంతల, మే 18 ప్రభాతవార్త:** ఉప్పునుంతల సబ్ ఇన్స్పెక్టర్ గా పి.మహేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన ఎస్ఐ గా పనిచేసిన వెంకట్ రెడ్డి జిల్లా ఎస్పీ కార్యా లయానికి బదిలీ కాగా ఆయన స్థానంలో వంగూరులో ఎస్ఐగా పనిచేసిన పుట్టమహేష్ బదిలీపై ఉప్పునుంతల ఎస్ఐగా వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అందరి సహకారంతోశాంతి భద్రతలు లోపించకుండాచర్యలు తీసుకుంటామని,గ్రామాలలో అలజడులు, గంజాయి, మాదక ద్రవ్యాలను విక్రయిం చకుండా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పేర్కొన్నారు. గ్రామాలలో శాంతి మార్గంలో ఉండేలా కృషి చేస్తానని ఎస్ఐ మహేష్ పేర్కొన్నారు.

## నూతన పెట్రోల్ బంకును ప్రారంభించిన ఎమ్మెల్యే మాతృమూర్తి శశికళ రెడ్డి

**బాలానగర్, మే 18 ప్రభాతవార్త :** బాలానగర్ మండల పరిధిలోని మోదంపల్లి గ్రామ శివారులో సోమవారం జడ్చర్లఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ధ్‌రెడ్డి మాతృమూర్తి శశికళ రెడ్డి, కాంగ్రెస్ నాయ కులు భుజ్యా నాయక్ నూతనంగా ఏర్పాటు చేసిన బాలాజీ ఫీలింగ్ స్టేషన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వయంకృషితో అభివృద్ధి సాధించాలని, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని యువత ఉపాధి రంగాల్లో ముందుకు రావాలని సూచించారు.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ నాయక్, తిరుమలగిరి గ్రామ సర్పంచ్ రాంజీ నాయక్, మోహన్ నాయక్ గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఎర్రగుట్ట చెక్‌పోస్టు వద్ద అక్రమ పశువుల రవాణా పట్టివేత

### డ్రైవర్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు

**నారాయణపేట, మే 18 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎర్రగుట్ట చెక్‌పోస్టువద్ద అక్రమంగా పశువులను తరలి స్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు వెల్లడించారు. పోలీసులు చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న సమయంలో యాద్గిరి నుంచి నారాయణపేట వైపు వస్తున్న అశోక్ లేలాండ్ వాహనాన్ని ఆపి తనిఖీ చేపట్టారు. తనిఖీలలో భాగంగా కేఏ 33 36162 నంబర్ గల వాహనంలో పరిమితికి మించి ప్రమాదకర పరిస్థితుల్లో 03 ఎద్దులు, 01 గేదె, 01 బర్రెపోతును తరలిస ్తున్నట్లు గుర్తించారు. పశువుల రవాణాకు సంబంధించిన ఎటువంటి అనుమతి పత్రాలు లేకుం డా వాహనాన్ని అజాగ్రత్త గా నడుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. వాహన డ్రైవర్‌ను విచారించగా అతను కర్ణాటక రాష్ట్రంలోని గుర్మిట్కల్‌కు చెందిన అబ్దుల్ వహీద్ (తండ్రి: అబ్దుల్ నాభీ)గా గుర్తిం చారు. పట్టుబడిన పశువులను తాత్కాలిక గోశాలకు తరలించి, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగి స్తున్నట్లు టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.


**పబ్లిక్ నోటీస్**

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియ జేయునది ఏమనగా బోయ విజయలక్ష్మి తండ్రి బోయ ఆనంద్ రిజిస్టర్ దస్తావేజు నం. 9525/2022, తేదీ: 25.10.2024 రోజున ఒరిజనల్ రిజిస్టర్ దస్తావేజు మహబూబ్‌నగర్ క్లాకటవర్ నందు పోగొట్టుకోవడం జరిగినది. కావున ఇట్టి రిజిస్టర్ దస్తావేజు ఎవరికైనా దొరికినచో ఈ క్రింది చిరునామాకు తెలియ జేయగలరు. లేదా ఇట్టి ఆస్తికి సంబంధించి ఎవరికైనా ఏదైనా అభ్యంతరాలు ఆక్షేపణలు ఉన్నచో తగిన ఆధారాలతో 7 రోజులలో క్రింది చిరునామాను. సంప్రదించగలరు.

ఆస్తి షెడ్యూల్డ్

తూర్పు 30 ఫీట్ల రోడ్ పడమర ప్లాట్ నం. 26
ఉత్తరం ప్లాట్ నం.34 దక్షిణం ప్లాట్ నం.35
కొత్త చెరువు రోడ్, మహబూబ్‌నగర్
ఇంటి నం : 1- 7 -222/15,

సెల్ నం : 8106161179



డంపింగ్ యార్డ్ ను పరిశీలిస్తున్న కమిషనర్ గిరీష్

## ఆక్రమణలు తొలగుతున్నాయ్!

- జడ్చర్లలో కమిషనర్ గిరీష్ రెండో రోజు పర్యటన
- ఎంపీడీవో కార్యాలయం ఆనుకొని ఉన్న ఎంక్రోచ్‌మెంట్ తొలగింపు

**జడ్చర్ల, మే 18, ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ ఎం.గిరీష్ జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో సోమవారం పర్యటించారు. శానిటేషన్, పార్కులు,డంపింగ్ యార్డు, సందర్శించారు. పార్కులను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అదేవిధంగా ఎంపీడీఓ కార్యాలయానికి అనుకోని ఉన్న రోడ్ ఎంక్రోచ్ మెంట్ ను కమిషనర్ తొలగింపజేశారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా,అడిషనల్ కలెక్టర్, పురపాలక సంఘం ప్రత్యేక అధికారి మధుసూదన్ నాయక్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని దాదాపు అన్ని కాలనీలో రోడ్లను ఆక్రమించి కారు పార్కింగ్ స్థలాలు,చెట్ల కోసం ఏర్పాటు చేసుకున్న గ్యారలీలను కూడా తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## నూతన వ్యవసాయ మార్కెట్ చైర్పర్సన్, డైరెక్టర్ల ఎన్నిక

**ఖిల్లాగణపురం మే,18 ప్రభాతవార్త:** ఖిల్లా ఘనపురం తో పాటు పెద్దమందడి ఉమ్మడి మండలాల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఘనపురం మండల కేంద్రానికి చెందిన నవనీతలు చైర్ పర్సన్‌గా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా దొడగుంటపల్లి కి చెందిన వెంకటేశ్వర రెడ్డి, డైరెక్టర్లుగా దిండి రవీందర్, వెల్టూరు డి. బాలరాజు, జంగమయ్యపల్లి, ముప్పూరి రత్నయ్య, మణిగిల్ల రఘునాథ్, పెద్దమందడి బయన్న, బాలాజీ పేట పాత్లావత్ భాష, దొంతికుంట తండా ఎస్ రవీందర్ రెడ్డి, సోలిపూర్ మర్యాద బాలకృష్ణారెడ్డి, కమాంచిపురం భక్తుల దుర్గయ్య, సల్కలాపురం ఎండి ఖాజా, మైనుద్దీన్ ఘన్పూర్ టు డి రవీంద్రనాథ్ రెడ్డి, రామకృష్ణారెడ్డి నూతన పాలకమండలిగా ఎంపిక చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి తో పాటు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పార్లమెంటు సభ్యులు, డాక్టర్ మల్లు రవి ,జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యే మెగారెడ్డిలకు, చైర్మన్ తో పాటు పాలకమండలి సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## పిడిఎస్ రైస్ పట్టివేత కేసు నమోదు చేసిన పోలీసులు

**ఖిల్లా ఘనపురం మే18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అప్పారెడ్డిపల్లి క్రాస్ రోడ్ దగ్గర సోమవారం మదనాపురం మండలం నుండి చిలమర్తి కృష్ణ అనే వ్యక్తి టీఎస్ 32 టి 9809 మహేంద్ర వాహనంలో పిడిఎస్ రైసును తరలిస్తుండగా పట్టుకొని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకటేష్ తెలిపారు.

## మాగనూర్ తహసీల్దార్‌గా అబ్దుల్ రహేమాన్

**మాగనూర్, మే 18 ప్రభాతవార్త:** మాగనూర్ మండల ఎమ్మార్వోగా అబ్దుల్ రహేమాన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంచార్జ్ తహసిల్దార్ గా ఉన్న సురేష్ కుమార్ తహసిల్దార్‌గాపదోన్నతి పొంది వెళ్లడంతో కొంతకాలం మక్తల్ డిటికు బాధ్యతలు ఇచ్చారు. మహబూబ్ నగర్ సివిల్ సప్లై డిటిగా ఉన్న రహేమాన్ తహసిల్దార్‌గాపదోన్నతి పొంది మాగనూర్‌లో బాధ్యతలు చేపట్టినట్టు తెలిపారు.మండలంలో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. మండల ప్రజలు సహకరించాలని కోరారు.

## ఎంసెట్‌లో పేట విద్యార్థి షేర్ గురుచరణ్ రెడ్డి ప్రతిభ

### రాష్ట్ర స్థాయిలో 82వ ర్యాంకు సాధించి సత్తా చాటిన విద్యార్థి



**నారాయణపేట, మే 18 ప్రభాతవార్త:** తాజాగా విడుదలైన ఎంసెట్ ఫలితా ల్లో నారాయణపేట జిల్లాకు చెందిన విద్యార్థి షేర్ గురుచరణ్ రెడ్డి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో 82వ ర్యాంకు సాధించాడు 122 మార్కులు తొలి ప్రయత్నం లోనే ఘనత సాధించడం విశేషం. గురుచరణ్ రెడ్డి, తపస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి షేర్ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయురాలు పారిజాత దంపతుల కుమారుడు. మొదటి ప్రయత్నంలోనే అత్యుత్తమ ప్రతిభకనబరిచి రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించడంతో కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, స్నేహితులు ఆనందం వ్యక్తం చేశారువిద్యార్థి సాధించినఈ విజయంపై తపస్ రాష్ట్ర నాయకులు మల్లికార్జున్,గుంపు బాలరాజ్, నర్సప్ప,తపస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్, అధ్యక్షుడు, కార్యదర్శులు నరసింహ, రవీందర్,జిల్లా కోశాధికారి కిషోర్‌కుమార్‌తో పాటుజిల్లాబాధ్యులు, మండ లాల అధ్యక్షులు, కార్యదర్శులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. గురుచరణ్‌రెడ్డి భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## ప్రతి గింజను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలి

### పెద్దాపూర్ సర్పంచ్ వంగ సాయిబాబాగౌడ్



పెద్దాపూర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

**ఉప్పునుంతల, మే 18 ప్రభాతవార్త :** ఆరుగాలం కష్టపడి పండించిన రైతులు మధ్య దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దనే ప్రతి గింజను విక్రయించాలని పెద్దాపూర్ గ్రామ సర్పంచ్ వంగా సాయి బాబాగౌడ్ సూచించారు.సోమవారం మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో ఐకెపి వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ వంగా సాయిబాబు గౌడ్ ప్రారంభించారు. రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని గ్రామాల్లో మధ్య దళారుల వ్యవస్థను రూపుమాపాలని ఆయన పేర్కొన్నారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వంగ సాయిబాబాగౌడ్, ఉప సర్పంచ్ నరేష్ యాదవ్, మండల గ్రామ మహిళా సమైఖ్య సభ్యులు చంద్ర కళ,సరిత, మండల విస్తీర్ణ అధికారిణి లక్ష్మీ రాఘ సందే,ఐకెపి సిసి పద్మ, వార్డు సభ్యులు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

## నూతన పెట్రోల్ బంకు ప్రారంభం



**బాలానగర్, మే 18 ప్రభాతవార్త:**బాలానగర్ మండల పరిధిలోని మోదంపల్లి గ్రామ శివారులో సోమవారం జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ధ్‌రెడ్డి మాతృమూర్తి శశికళరెడ్డి, కాంగ్రెస్ నాయకులు భుజ్యా నాయక్ నూతనంగా ఏర్పాటు చేసిన బాలాజీ ఫీలింగ్ స్టేషన్‌ను ప్రారంభించారు.ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వయంకృషితో అభివృద్ధి సాధించాలని, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని యువత ఉపాధి రంగాల్లో ముందుకు రావాలని సూచించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ నాయక్, తిరుమలగిరి గ్రామ సర్పంచ్ రాంజీ నాయక్, మోహన్ నాయక్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# యువత ఆరోగ్యమే సమాజ బలం..

- క్రీడలతో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి
- గ్రామీణ స్థాయి నుంచే క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 18 ప్రభాతవార్త:** యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటేనే సమాజం బలంగా నిలుస్తుందని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో కనీసం కొంత సమయాన్ని వ్యాయామం, నడక, యోగా వంటి కార్యక్రమాలకు కేటాయించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో క్రీడలు, యువత ఆరోగ్యం అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తూ జిల్లా యువజన క్రీడల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోయోగా, ఆరోగ్య తెలంగాణ" కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.తొలి రోజు ఉదయం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఫిట్ అండ్ యాక్టివ్ 2రీ రన్" కార్యక్రమాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. నాగర్‌కర్నూల్ క్రీడా



2కే రన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

మైదానం నుంచి కేసరి సముద్రం ట్యాంక్ బండ్ వరకు నిర్వహించిన 2కే రన్‌లో కలెక్టర్ యువత,అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం, యువత శక్తి, క్రీడా సంస్కృతి అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జిల్లాలోనిఅన్ని మండలాల్లో ఆరోగ్య సంబంధిత కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆధునిక జీవనశైలిలో వ్యాయామం, క్రీడలు తగ్గిపోతున్న నేపథ్యంలో యోగా,నడక, పరుగులు వంటి అలవాట్లను ప్రతిరోజూ జీవితంలో భాగం చేసుకోవాలని యువతకు సూచించారు. ఫిట్ అండ్ యాక్టివ్ 2రీ రన్" వంటి కార్యక్రమాలు కేవలం ఒకరోజు కోసం కాకుండా ఆరోగ్యకరమైనజీవనశైలిని ప్రోత్సహించడమేలక్ష్యంగా నిర్వహిస్తున్నామని స్పష్టంచేశారు. విద్యార్థులు,యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ,ఆత్మవిశ్వాసం పెరుగుతాయని,అది వారి భవిష్యత్తు నిర్మాణానికి దోహదం చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం గ్రామీణ స్థాయి నుంచే క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు కృషి చేస్తోందన్నారు. కలెక్టర్ స్వయంగాయోగా కార్యక్రమంలోపాల్గొని విద్యార్థులు,యువతకు ప్రేరణగా నిలిచారు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత, ఉపాధ్యా యులు, స్థానికప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.నిర్వహించిన యోగాకార్యక్రమంలో వివిధ ఆసనాలు, శ్వాస వ్యాయామాలను పతంజలి యోగ గురువు ఆధ్వర్యంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల శాఖ అధికారి సీతారాంనాయక్, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, ఆర్టీవో సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## చెరువు విస్తరణ ప్రతిపాదనపై అఖిలపక్ష కమిటీ ఆందోళన

- గ్రామానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందంటూ అదనపు కలెక్టర్‌కు వినతి



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

**నారాయణ పేట, మే 18 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా ఉట్కూరు పెద్ద చెరువు సామర్థ్యాన్ని 800 ఎకరాల నుంచి 19 వందల ఎకరాలకు (సామర్థ్య పెంపు ప్రతిపాదన) విస్తరించాలనే ప్రణాళిక వల్ల గ్రామంలోకి ఊట నీరు చేరి గ్రామ ప్రజలకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని ఉట్కూర్ అఖిలపక్ష కమిటీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ శ్రీనుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, ఉపసర్పంచ్ రమేష్, మాజీ ఉపసర్పంచ్ ఇబదూర్ రెహమాన్, ఆనంద్ కుమార్, భరత్, సమీ ప్రకాష్ తదితరులు మాట్లాడుతూ చెరువు సామర్థ్య పెంపు వల్ల గ్రామంలోని పాఠశాలలు, ఇళ్లు, ప్రార్థన స్థలాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే గ్రామంలోకి నీరు చేరకుండా ఉండేందుకు సిపేజ్ కట్ ఆఫ్ వాల్ నిర్మాణం, టో డ్రెయిన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభావిత కుటుంబాలకు ఆర్ఆర్ ప్యాకేజీ కింద పునరావాసం కల్పించేంత వరకు ప్రాజెక్టు పనులను నిలిపివేయాలని వారు కోరారు. గ్రామ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

## నూతన ఎస్ఐని సన్మానించిన జక్కుల చిన్న జంగయ్య యాదవ్



ఎస్ఐని సన్మానిస్తున్న దృశ్యం

**వెల్దండ, మే 18 ప్రభాతవార్త:** వెల్దండ పోలీస్ స్టేషన్‌కు నూతనంగా విచ్చేసిన ఎస్ఐ యుగేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో జక్కుల చిన్న జంగయ్యయాదవ్ సన్మానించారు.మండలంలో శాంతిభద్రతలను కాపాడాలని ప్రజలకు న్యాయం చేయాలని సూచించారు. వెల్దండ మండలంలో ఎస్ఐగా పనిచేసి బదిలీపై కల్వకుర్తిలో విధులు నిర్వహిస్తున్నటువంటి ఎస్ఐ కురుమూర్తి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి వెల్దండ మండలం ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని ఎస్ఐ కురుమూర్తికి జక్కుల చిన్న జంగయ్య యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.వారి వెంటే జక్కుల చిన్న జంగయ్య యాదవ్, యువసేన సభ్యులు అరుణ్ నాయక్, కొండల్ యాదవ్, జక్కుల మల్లేష్ యాదవ్, శ్రీశైలం, శ్రీను, శేఖర్, ముత్యం, మల్లేష్ ఉన్నారు.

## దిశ కమిటీ సమావేశంలో పాల్గొన్న వడ్డేపల్లి మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మ



ఎంపి మల్లురవికి వినతి పత్రం సమర్పిస్తున్న వడ్డేపల్లి మున్సిపల్ చైర్మన్

**వడ్డేపల్లి, మే 18 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ)సమావేశం ఘనంగా నిర్వహించబడింది. జిల్లాలో అమలవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలుఅభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమగ్రంగా సమీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, అలంపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే విజయుడు, వడ్డేపల్లి మున్సిపల్ చైర్మన్ మంజుల, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ తో పాటు వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో గ్రామీణ, పట్టణాభివృద్ధి, తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్య, వైద్య సేవలు, ఉపాధి హామీ పనులు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాల ఫలాలు త్వరితగతిన అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని ప్రజాప్రతినిధులు సూచించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. అనంతరం వడ్డేపల్లి మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మ శాంతినగర్ ప్రాంత ప్రజల సౌకర్యార్థం ప్రస్తుతం ఉన్న పోస్టాఫీసును సబ్ పోస్టాఫీస్‌గా అప్‌గ్రేడ్ చేయాలని నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవికి, ఎమ్మెల్యే విజయుడుకి వినతిపత్రం అందజేశారు. శాంతినగర్ ప్రాంతంలో జనాభా పెరుగుతున్న నేపథ్యంలో పోస్టల్ సేవలను మరింత విస్తరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఉందని చైర్మన్ వివరించారు. దీనిపై ఎంపీ, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## వివాహిత ఆత్మహత్య

**వనపర్తి క్రైమ్, మే 18, ప్రభాతవార్త:** వనపర్తి పట్టణంలోని 21వ వార్డు హరిజనవాడకు చెందిన వివాహిత బంకలి అరుణ (30) భర్తబంకలి రాజశేఖర్ అనుమానాస్పదంగా మృతి చెందింది. ఈ విషయంపై కాలనీ వాసులు భర్తపై అనుమానం వ్యక్తం చేస్తూ న్నారు. సోమవారం జరిగిన ఈ మానవీయ సంఘటన సమాజానికి తలవంపు అని కాలనీవాసులు చర్చించుకుంటున్నారు. జరిగిన ఘటనపై సమాచారం అందుకున్న పోలీసు యంత్రాంగం తమదైన శైలిలో విచారణ జరుపుతున్నారు. పోలీసుల ఇన్వెస్టిగేషన్ అనంతరం నిజనిజాలు తెలిసే అవకాశం ఉంది. ప్రస్తుతం అనుమానంగా ఉన్నభర్త రాజశేఖర్ పోలీసుల అదుపులో ఉన్నారు. మృతురాలికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడుని పరామర్శించిన జిల్లెల చిన్నారెడ్డి



**పెద్దమందడి, మే 18 ప్రభాతవార్త :** పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగత్ పల్లి సర్పంచ్ పెంటన్న యాదవ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంటికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల చిన్నారెడ్డి సోమవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. పెంటన్న యాదవ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న చిన్నారెడ్డి వైద్యుల సూచనలను పాటించాలని సూచించారు. త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కోళ్ల వెంకటేష్, పెద్దమందడి, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, సీనియర్ నాయకులు రవి తదితరులు ఉన్నారు.

## గోపన్నపల్లిలో చౌడేశ్వరిదేవీ మాతను దర్శించుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్

**భూత్పూర్,మే 18,ప్రభాతవార్త:** భూత్పూర్ మండలం గోపన్నపల్లిలో గత రెండ్రోజులుగా గ్రామదేవత చౌడేశ్వరిదేవీ మాత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.ఈ ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి గోపన్నపల్లికి చేరుకుని చౌడేశ్వరిదేవీ మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఎమ్మెల్యే జీఎంఆర్ వెంట పోతులమడుగు గ్రామ సర్పంచి ఆనంద్‌రెడ్డితో పాటు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్,మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డి,పోతులమడుగు మాజీ సర్పంచి,మండల కాంగ్రెస్‌ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరియా నాయక్,మాజీ ఉపసర్పంచి కోట్ల కిష్టయ్య, నారాయణరెడ్డి,రవినాయక్ తదితరులు ఉన్నారు.



## విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి : జిల్లా కలెక్టర్

చూపించారు. ఈ మాక్‌డ్రిల్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు ఎస్పీ రాజేష్ మీనాతో కలిసి పరిశీలించి, సహాయక చర్యల నిర్వహణ తీరును పర్యవేక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విపత్తులు వచ్చి అత్యవసర పరిస్థితులు ఏర్పడిన సమయంలో ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా ప్రజల్ని ఎలా కాపాడాలని అంశంపై మార్క్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ శాఖలు సంసిద్ధత కోసం ఈ మాక్ డ్రిల్ అనేది ఎంతో ముఖ్యమైన ప్రక్రియ అని తెలిపారు. వరదలు వచ్చి అత్యవసర పరిస్థితులు ఏర్పడే ఏడు ప్రదేశాలను జిల్లాలో గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. 10 సెంటీమీటర్స్ పైన వర్షపాతం నమోదు అయితే నల్ల చెరువు ప్రాంతంలో వరద నీటితో అత్యవసర పరిస్థితి ఏర్పడే నేపథ్యంలో ఇక్కడ మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ వైద్య ఆరోగ్యశాఖ, నీటిపారుదల శాఖ, ఇతర ముఖ్యమైన శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజల ప్రాణాలను కాపాడే చర్యలను సంసిద్ధతను ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమం లో వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, డిఎస్పి గిరి ప్రసాద్, ఇతర జిల్లా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాక్‌డ్రిల్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

## ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి)

రెడ్ క్రాస్ మెంబర్‌షిప్ డ్రైవ్‌కు సంబంధించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీలో జిల్లా అధికారులు,ఎంపిడిఓలు, తహశీల్దార్లు సభ్యత్వం నమోదు చేసు కోవాలని సూచించారు. అధికారులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని తెలిపారు.జిల్లా ఎంప్లాయి మెంట్ వెబ్‌సైట్‌లోకి వెళ్లిరెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వం కోసం నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను సూచించారు. అనంతరం జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ద్వారా అమలు చేస్తున్న ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్, ధరతి ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాలను మే 18 నుంచి 25 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి ఛత్రు నాయక్ తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధు సూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జెఎల్‌బి హరిప్రియ, డిఆర్ఓ రామ్ రెడ్డి,జడ్పి సీఈఓ,ఇంచార్జి డీపీఓవెంకట్‌రెడ్డి, డీఆర్‌డీఓ నరసింహులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## బధిరులకు సర్కారు భరోసా

- వినికిడి లోపం ఉన్న పిల్లలకు పరికరాలు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



వినికిడి లోపం ఉన్న పిల్లలకు పరికరాలు అందజేస్తున్న కలెక్టర్

**మహబూబ్‌నగర్, మే18, ప్రభాతవార్త:** వినికిడి లోపం ఉన్న చిన్నారులు సమాజంలో ఇతర పిల్లలతో సమానంగా ఎదగడానికి అవసరమైన సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తున్నదని మహబూబ్‌నగర్ కలెక్టర్ కుష్బూ గుప్తా తెలిపారు.ఆర్‌బిఎస్‌కె, డిఈఐసి అధికారులు గుర్తించిన ఏడుగురు వినికిడి లోపం ఉన్న పిల్లలకు (బధిరులకు) జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, సోమవారం తన ఛాంబర్ లో వినికిడి పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ఇలాంటి పరికరాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి జరీనా బేగం, జిల్లా వైద్య శాఖ అధికారి డా. కృష్ణ పాల్గొన్నారు.

## అనుమతులు ఒకచోట.. అక్రమ తవ్వకాలు మరోచోట

(మొదటి పేజీ తరువాయి)


సంబంధిత వ్యక్తుల నుంచి ప్రభుత్వ నష్టాన్నిరికవరీ చేయాలని డిమాండ్ చేశారు.అలాగేనిబంధనలు ఉల్లం ఘించినవారిపై, సహకరించిన అధికారులపై చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణ చర్యలు తీసుకోకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట బీసీ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## మామిళ్ళపల్లి, పెద్దాపూర్ గ్రామాల మధ్య రోడ్డు మార్గాన్ని పరిశీలించిన అధికారులు



**ఉప్పునుంతల, మే18 ప్రభాతవార్త:** మండలంలోని మామిళ్ళపల్లి గ్రామం నుంచి పెద్దాపురం వరకు వెళ్లే రోడ్డు మార్గాన్ని సోమవారం ఎంపీడీఓ వరుణ్ తేజ పరిశీలించారు. రెండు గ్రామాల మధ్య గత కొన్ని సంవత్సరాల నుంచిలింక్ రోడ్డు ఉండేదని,అట్టి రోడ్డు పూర్తిగా దెబ్బతిందని గ్రామ సర్పంచ్ టి పిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న రోడ్డు పరిస్థితిని పరిశీలించాలని ఎంపీడీఓ వరుణ్ తేజకు ఆదేశించడంతో ఎంపీడీఓ వరుణ్ తేజ ఆధ్వర్యంలో అధికార బృందం దెబ్బతిన్న పనులను పరిశీలించారు.రెండు గ్రామాల మధ్య ఉన్న ఫార్మేషన్ రోడ్డు పట్ల ఉన్నత అధికారులకు నివేదిక అందజేయనున్నట్లు ఎంపీడీఓ వరుణ్ తేజ పేర్కొన్నారు.ఈ మార్గాన్ని పరిశీలించిన వారిలో ఎంపిడిఓ వరుణ్ తేజ, ఈజీఎస్ ఏపీఓ పర్వతాలు, సర్పంచ్ మొకురాల మోహన్ గౌడ్, టెక్నికల్ అసిస్టెంట్ ఉమాపతి చారి, పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్,గ్రామస్తులు తిరుపతయ్య, సాయిబాబు, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ఎక్కే వెంకటేష్



**రేవల్లి, మే 18 ప్రభాతవార్త:** ఉమ్మడి గోపాల్‌పేట మండలం వ్యవసాయ మార్కెట్ యాడ్ కమిటీ చైర్మన్‌గా తలుపునూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎక్కే వెంకటేష్ ఎంపిక య్యారు. ఈ సందర్భంగా తలుపునూరు గ్రామంలో పార్టీ నాయకులు కార్యకర్తలు టపాకాయలు కాలుస్తూ మిఠాయిలు తినిపించుకుని సంబరాలు జరుపుకున్నారు. ఉమ్మడి మండలానికి మా గ్రామ నాయకులను చైర్మన్‌గా నియమించినందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులకు, ఎమ్మెల్యే మేఘారెడ్డికి, సీఎం రేవంత్‌రెడ్డికి ఎక్కే వెంకటేష్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.